

# బ్రాహ్మణార్థం

## శ్రీ రావినూతల రామమూర్తి పంతులు

అప్పు డప్పుడే అరుణోదయ మవుతున్నది. నిత్యానందశాస్త్రి నిద్రలేచి కాల్యములు తీర్చుకొన్నాడు. ఆతని లలాటమందలి విభూతి రేఖలు లలాటరేఖలను తుడిచి వేయలేక తెల్లబోయినట్లున్నవి. అతను మామూలుప్రకారం పాఠంపుస్తకాలు సవరిస్తూన్నాడు. ఇంతలో "మిమ్మల్ని వకీలు నరసింహంపంతులుగారు రమ్మంటున్నారండీ! అర్జెంటుగా" అంటూ ఒక జవాను వచ్చాడు.

నిత్యానందం పంతులుగారి గృహానికి "ఎందుకు రమ్మన్నారో ననుకుంటూ" వెళ్లినాడు.

నరసింహం పంతులుగారు గుంటూళ్లో పేరు ప్రతిష్టలు గల గొప్ప లాయరు. ఆస్తి బాగా సంపాదించాడు. పెద్ద మేడ కట్టించాడు, యాభై వేలు వడ్డీకి మారుతున్నవి. ఎంత లేదన్నా నెలకు అయిదువందలకు తక్కువరావు ప్రాక్టీసులో. ఇంట్లో యెక్కువ ఖర్చులేదు. ఆయనా, ఆయన భార్యా, కూతురూ, అరవైయేండ్ల ముసలితల్లీ, అంతా నలుగురు. అయితే అతిధి అభ్యాగతులు అర్ధరాత్రివేళ వచ్చినా ఆదరించి ఆదంపతులు ఒకరికంటే ఒకరు యెక్కువ శ్రద్ధాభక్తులతో విచారిస్తారు.

ఆవేళ పంతులుగారి తండ్రి ఆబ్దికం. ఊరంతా విచారించినా మంత్రం తెలిసిన ఒక భోక్తమాత్రమే దొరికాడు. రెండో భోక్తకు యెవ్వరూ దొరకలేదు. ఇక పెద్దవాళ్ళెవరూ దొరకరని నిరాశజెంది సమీపంలోవున్న నిత్యానందాన్ని బ్రాహ్మణార్థం చెయ్యడానికి తగినవాడనుకుని నరసింహంపంతులు పిలిపించాడు.

నిత్యానందం తల్లిదండ్రులకు యేకైక పుత్రుడు. చాలా గారాబంగా పెరిగాడు. పొరుగూళ్లో వొంటరిగా వుంచడానికి మనసొప్పక, వాళ్లనాయన నిత్యానందానికి ముసలమ్మను తోడుంచి వొక అద్దెయింట్లో ఖర్చునుకొక గుంటూళ్లో కాపురం ఏర్పాటుచేశాడు. వాళ్లవూరికీ గుంటూరికీ చాలా దగ్గరకావడంచేత వారంవారంవచ్చి స్వయంగా మంచి చెడ్డలు విచారించుకొని పోతూండేవాడు.

నిత్యానందంకూడా, యీకాలపు పిల్లలవలె మరీ అంత గడుగ్గాయకాడు. చాలా నెమ్మదయిన కుర్రాడు. వాళ్ళ ముసలమ్మ ఎన్ని అక్షరాలు చెబితే అన్నీ తూచా తప్పనియ్యడు. నిత్యానందం - అప్పటి విద్యార్థిలోకంలోకంతా - చాలా పూర్వాచార పరాయణుడుగా వుండేవాడు - అంటే - ప్రతిరోజూ సూర్యోదయాత్పూర్వమే లేవడమూ, స్నాన సంధ్యాది కాలకృత్యాలు వేళతప్పకుండా నెరవేర్చుకోడమూ అతని దినచర్యలో ప్రప్రథమంగా జరిగేవి. అయితే కాలానుగుణ్యంగా మడీమైలా పాటిస్తూ వుండేవాడు. తడిగుడ్డ కాకపోయినా పట్టుబట్టయినా కట్టుకోకుండా భోంచేసేవాడుమాత్రం కాదు. ప్రతిరోజూ సాయంకాలం అన్ని దేవాలయాలకీ తప్పకుండా హాజరవుతూండేవాడు వాళ్ల ముసలమ్మతోటి. బిళ్ళగోచీ పంచెకట్టూ, నడినెత్తిన పిల్లజుట్టూ, అతని సదాచార సంపన్నతనూ సనాతనధర్మావలంబనాసక్తినీ స్థిరపరుస్తూండేవి.

పంతులుగారితో నిత్యానందం తానెప్పుడూ బ్రాహ్మణార్థం చెయ్యలేదనీ, అంతప్రొద్దుపోయిందాకా ఆకలికి

ఓచ్చివుండలేదనీ, ఆవేళ తాను స్కూలుకు పోకపోతే హెడ్మాష్టరు కోప్పడ్తాడనీ, యింకా యెన్నో కారణాలు చెప్పి తప్పించుకుందామని చూచాడు. కాని పంతులుగారు భోజనం పదిగంటలకయ్యేట్టు ఏర్పాటు చేస్తాననీ, తాను స్వయంగా వెళ్లి హెడ్మాష్టరుతో చెప్పి మాటరాకుండా చేస్తాననీ, అన్నిటికీ అన్నిసమాధానాలు చెప్పి "ఈరోజు నీవు బ్రాహ్మణార్థం చెయ్యకుంటే మా తండ్రిగారి ఆబ్దికం మునిగిపోతుందనీ" బతిమాలాడు. ఇక పెద్దమనిషి యింతగా ప్రాధేయపడుతున్నప్పుడు వినకపోతే బాగుండదని వొప్పుకున్నాడు నిత్యానందం.

పదిగంటలు కావస్తున్నది. ప్రతిరోజూ ఆపాటికి భోంచేసేవాడుకదూ? ఆ అలవాటుచొప్పున యీవేళ కూడా నిత్యానందం కడుపులో ఆకలి చిచ్చురగుల్కొన్నది. అందుకోర్వజాలక అతని భౌతికమూర్తి తల్లడిల్లింది. తత్ఫలితంగా తలనొప్పి ప్రారంభించింది. కళ్లుతిరగడం ప్రారంభించాయి. తల దిమ్మెక్కింది.

పదకొండు గంటలయింది. స్నానంచేసి రావలసిందని నరసింహం పంతులుగారి దగ్గర్నుంచి కబురొచ్చింది. నిత్యానందం నెమ్మదిగా లేచి యెండవేసిన మడిధోవతి కట్టుకొని మరో వుత్తరీయం వల్లెవాటు వేసుకొని బయలుదేరాడు బ్రాహ్మణార్థానికి.

నిత్యానందాన్ని చూసి పంతులుగారు స్నానానికి లేచారు. అంతకు పూర్వమే వచ్చివున్న మల్లావధాని - యాజ్ఞికుడు - స్నానంజేసి తల విరబోసుకొని వొంటినిండా విభూతి రేఖలూ - ఆయనా - గంధంతీస్తూ కూచుని వున్నాడు మూర్తీభవించిన రుద్రుడిలాగా. గంధాక్షతల గిన్నెలూ, దీపారాధన సెమ్మెలూ, వొత్తులూ, ఔపోసనేత్యాది మంత్ర తంత్రాల కుపయోగించడానికి మర చెంబూ స్థాలీనిండా మంచినీళ్లూ ఒకవైపునా, అగ్నిహోత్రానికి సమిధలూ, పవిత్రాలకు దర్భలూ, భోజనానికి దొన్నెలూ, విస్తళ్లూ, మరొకవైపునా, మధ్య అపరశంకరుని లాగు ఆభోక్త ఆ ప్రదేశానికెంతో పవిత్రతను చేకూరుస్తూన్నట్టున్నది. నిత్యానందం అక్కడికి రాగానే "రెండో భోక్తగా ఎవడో విద్యార్థి వస్తాడన్నారు పంతులుగారు; నీవేనా?" అన్నాడు అవధాని.

"అవును నేనండీ!" అన్నాడు నిత్యానందం.

అవ:—అయితే మరీ ఒకసారె మడి కట్టుకొనిరాక మైలతో వొచ్చావేమీ? అన్నాడు.

నిత్యా:—మడితోనే వొచ్చానండీ!

అవ:—అఘోరించినట్టుంది నీ మడి - చేతులో స్థాలీ అయినా లేకుండా?

నిత్యా:—ఓహో! చేతులో స్థాలీ లేకపోతే మాత్రం మడికాదా - స్నానంజేసి శుభ్రంగా వుతికి ఆరవేసిన బట్ట కట్టుకుంటే?

అవ:—గుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించిందట - లేకపోతే - మడితో బ్రాహ్మణార్థానికి వొచ్చేవాడు ఎవడైనా సరే చేతులో చెంబులేకుండా వొస్తాడా? నీకు కాబట్టి సరిపోయింది కాని - అన్నాడు కఠినస్వరంతో

నిత్యా:—మీకన్నా శుభ్రంగానే స్నానంచేసి మడి కట్టుకున్నా లెండి - మీరెందుకు భయపడతారు - అన్నాడు నిర్లక్ష్య భావంతో.

ఆ మాటలకు భగ్గున మండిపడి అవధాని "ఈ కాలపు కుర్రాళ్లందరికీ యిదే పెడసరం. ఏమాటకూ వితండంగా వాదిస్తారు. అవును! నీ తప్పేమున్నది. ఇంగ్లీషుగాలే నీకు సోకింది. అది ఎట్లా ఆడిస్తే అట్లా ఆడవలసిందే - లేకపోతే పండువంటి బ్రాహ్మణకులంలో బుట్టి మన మతాచారాల్ని యింత నిర్లక్ష్యంగా చూడడమా? యింకేముంది! ప్రపంచంలో బ్రాహ్మణీకమే నశించి పోతున్నది; బ్రాహ్మణులంతా భ్రష్టులయి పోతున్నారు. ఏంజేస్తాం! ఎవరి కర్మవాళ్లనుభవించ వలిసిందే" నంటూ మొదలెట్టాడు. ఈగందరగోళం విని వంటచేస్తూన్న పంతులుగారి తల్లి పరుగెత్తుకొని వచ్చి "ఇంగ్లీషు చదువుకునేవాడు ఆ అబ్బాయికేం తెలుసులేండి పాపం" అనిచెప్పి శాస్త్రిల వారిని శాంతపరిచింది. ఇంతలో నరసింహం పంతులు కూడ స్నానంచేసి వచ్చాడు. అవధానులవారు నిత్యానందం మళ్లీ స్నానంచేసి, మడి కట్టుకుంటేనే కాని పనికి రాదన్నాడు. విధిలేక - వొప్పుకున్న నేరానికి - నిత్యానందం పంతులుగారింట్లోనే మళ్లీ చన్నీళ్లు శిరఃస్నానం చేశాడు. కట్టుకోడానికి యెండ వేసిన మడిధోవతి

తయారుగా లేకపోవడం చేత తడికొల్లాయి గుడ్డే కట్టుకో వలసి వొచ్చింది. పంతులుగారి తల్లి చెంబుతో నీళ్లూ స్థాలీ అవీయిచ్చి నిత్యానందాన్ని ధోవతి ఆరేవరకు సంధ్య వార్చుకో మన్నది. “సంధ్య యింట్లో వుదయమేవార్చా”



నన్నాడు నిత్యానందం. “అట్లాకాదు - మళ్లీ యిక్కడ వార్చవలసిందే - అసలు నీకువచ్చునో, రాదో ఎవరికి తెలుసు” - నన్నాడు అధికార సూచకంగా అవధాని. “నీవు మెడల్సు యివ్వకుంటే మా నెలే-నాసంధ్య వార్చడం చూచి” అన్నాడు మెల్లగా. ఆ మాటలువిన్న పంతులు “అబ్బాయీ! అధి కస్య అధికంఫలం మళ్లీ ఓమాటు సంధ్యావందనం చేస్తే తప్పేమీ లేదులే; పెద్దవారు చెబుతున్నారు. అలా కూర్చొని వార్చు” అన్నాడు. నిత్యానందం సంధ్యావందనం చేస్తూంటే - పంతులూ అవధాన్లూ యధావిధిగా సమంత్రకంగా పితృయజ్ఞం మొదలెట్టారు.

నిత్యానందానికి ఆకలి దహించుక పోతున్నది. కళ్లు తిరుగుతున్నవి. తలనొప్పి అధికమయింది. కూర్చోడానికి కూడా ఓపిక లేకపోయింది. వాడినతోట కూరకాడలాగా జారగిలబడి కూర్చున్నాడు. అయితే అవధానులు పంతుల వారిని జందెము అటు తిప్పమనీ యిటుతిప్పమనీ మధ్య మధ్య జందాన్ని తావళంగా వేసుకోమనీ పవిత్రాన్ని ఆ వేలుకు పెట్టుకోమని యీ వేలుకు పెట్టుకోమనీ పెడుతున్న తిప్పలు అదోవింతగా చూస్తూ వుండడముచేత నిత్యానందముకు ఆకలిబాధ కొంత వుపశమించినట్టుగా తోచింది.

భోక్తలు భోజనానికి కూచున్నారు. అవధానులు ప్రాఙ్ముఖముగా పీట వేసుకున్నాడు. నిత్యానందము కూడా అతని సరసనే తూర్పు ముఖముగా కూర్చోబోయినాడు. అవధానులు అదిచూచి “ఛా ఛా ఏమిటి అట్లా వేస్తున్నావు పీట. నీవు బ్రాహ్మణుడవేనా?” అన్నాడు. నిత్యానందము లేచి యీ మాటలకు అవధానులను తన్నడానికి సిద్ధమవుతున్నాడు. పంతులువారు యిది గమనించి అవధానులను తొందర పడవద్దని మందలించి నిత్యాందాన్ని దక్షిణాభిముఖముగా కూచోమని చెప్పినాడు.

“ఏమండి వారి సరసనే కూర్చుంటే తప్పా” అన్నాడు నిత్యానందము.

“చూడండి పంతులుగారూ, పయిగా మీరు సర్దిచెబుతారు. వీడు బ్రాహ్మణ పిల్లవాడేనా” అంటూ రేగినాడు. పంతులుగారు నవ్వుతూ అతనెన్నడూ బ్రహ్మణార్థముకు వచ్చినవాడు కాడనీ ఆబ్దీకతంతు అయినా తెలియవలసిన అగత్యము అంతవరకూ అతనికి పట్టలేదనీ ఏవో సాంత్వనవాక్యాలుచెప్పి, నిత్యానందముతో యింగ్లీషులో అవధానులు చాదస్తపు వాడనీ అతనిమాటలు అంతగా పట్టించుకోవద్దనీ చెప్పినాడు.

వడ్డన అయింది. అవధాన్లు అన్నసూక్తపరాయణము యింటి పెంకు లెగిరిపొయ్యేట్టుగా ప్రారంభించినాడు. ఒక గంటన్నర అయినా అది పూర్తి అయ్యేట్టు గా లేదు.

ఔపోసము పంతులు వేసేసరికి అపరాహ్ణము అయిపోయింది. విస్తట్లోవున్న పదార్థాలన్నీ చప్పగా చల్లారి

పోయినవి. నిత్యానందము యీలోకంలో లేదు. మెతుకులు నంజడము మొదలుపెట్టినాడు. అయితే అవిమాత్రము లోపలికి పోకుండా వెనకాడుతున్నవి. అవధానుల విస్తరిలో వన్నీ కనురెప్పపాటు కాలములో మాయమయి పోతూవున్నవి.

పంతులు తల్లి నిత్యానందం విస్తరివంక చూసి "ఏ మబ్బాయీ - నీవేమీ తింటున్నట్టే లేదే. నెయ్యి వడ్డించుకో" అంటూ జవాబుకోసం ఆగకుండానే మంచి నీళ్లులాగా యింత నెయ్యి పోసింది. అతనికేమీ తోచక గుడ్లు మిటకరించుకొని చూస్తూవుంటే అవధానులు అధికారంగా "ఏమిటి ఏమీ తినకుండా అట్లాచూస్తావు. భోక్తలు శ్రద్ధగా తినకపోతే అసలు శ్రాద్ధము చెడిపోతుంది. నిన్ను పంతులుగారు రప్పించింది శ్రాద్ధము మంట కలపడానికా" అని టపటప అడగడము మొదలుపెట్టినాడు. నిత్యానందునకు ఆస్థితిలో విసుగూ అసహ్యమూ కూడా వేసింది. అతి విసుగుతో "అవధానులు మీరొక్కరే నేర్చుకుంటే సరా - నాకు కూడా ఉపదేశం చేయండి ఆ తినేమార్గం" అన్నాడు. ఆయన పకపక నవ్వి "అట్లా వుత్రవాళ్లు అడిగి తెలుసుకోవాలి. అదుగో ఆ పెసరపప్పు సమూలంగా తీసి సగం అన్నంలో కలుపు. నెయ్యి కాస్త జారెట్టుగా కలుపు. తక్కినవన్నీ దాంట్లోనంజు. అన్నీ మహాబాగా లోపలికి వెళ్లుతవి" అన్నాడు.

నిత్యానందము అట్లాగే చేశాడు. అతనికి తెలియకుండానే విస్తరి ఖాళీ అవుతూంది. ఖాళీ అవుతూవున్న కొద్దీ ముసలమ్మ వ్యంజనాలు తీసుకొనివచ్చి పడవేస్తున్నది. పొట్ట వుబ్బుతూవుంది. భోజనాలయినాయి. ఆబ్దిక కర్మావశిష్టము ముగించారు.

గృహమేధి దక్షిణా తాంబూలాదులనిచ్చి సత్కరించాడు భోక్తలను. ఇద్దరు భోక్తలకూ తలకొక రూపాయి దక్షిణా, చెరిఒక ధోవతీ ముట్టినాయి. అవధానులు పంతులుగారితో మాట్లాడుతూ కూచున్నాడు. పంతులు గారి దగ్గర సెలవుతీసుకొని నిత్యానందము యింటికి వెళ్లాడు.

నిత్యానందం భుక్తాయాసంతో మెల్లగా యిల్లుజేరి మంచానికి చేరగిల బడ్డాడు. కడుపు నొప్పిగావుంటే రెండు సోడాలు తెప్పించుకొని తాగాడు. శిరోభారం యెక్కువగా వుంటే సగం డబ్బీ అమృతాంజనం రాచాడు. కాళ్లూ చేతులూ చచ్చుతీపులు పుట్టాయి. సర్వావయవాలూ సమ్మెట పెట్టులబడినట్లు తీపులు తీయడం ప్రారంభించాయి. సాయంత్రం ఆరు గంటలకంతా జ్వరం తీవ్రంగా తగిలింది- జ్వరం తీవ్రతచేత పిచ్చి పిచ్చిగా మాటలాడటం మొదలెట్టాడు. దాహం దాహం అంటూ అమితంగా నీళ్లు తాగడం ప్రారంభించాడు. రాత్రి ప్రొద్దు పోయిన కొద్దీ..."బ్రాహ్మణార్థమా...అబ్బ! అంతసేపు వుండలేనండి...మహా ఆచారం...యీలా కూచుంటే ఏమీ?" అంటూ కలవరింతలు మొదలు పెట్టాడు.

ఉదయమే డాక్టర్ను పిలిపించారు. డాక్టరు వచ్చి పరీక్షించాడు. టెంపరేచరు కొలిచాడు. నూటరెండు డిగ్రీలున్నది. రోగి మనలోకంలో లేడు. ఎంతఎగ్జామిన్ చేసినా డాక్టరుకు రోగివ్యాధి యేమిటో తెలియ లేదు పాపం. రోగిని పలుకరిస్తే... "బ్రాహ్మణార్థమా. అబ్బ. అంతసేపు వుండలేనండీ!..." అంటాడు గాని మరి మాట్లాడడు. ఈ మాటలువిని డాక్టరు ఆశ్చర్య పడ్డాడు.

డాక్టరు మరుక్షణమే నిత్యానందాన్ని జట్కామీద తీసుక వెళ్లి ఆస్పత్రిలో యిండోర్ పేషంటు వార్డులో చేర్చాడు. ఒకనర్సును గంట గంటకు ఏదో ఔషధమిమ్మని జెప్పాడు. నిత్యానందం కలవరించడం అట్లనే వున్నది. ఆస్పత్రికి వొచ్చే పోయేవాళ్లందరూ నిత్యానందం కలవరించడం చూచి ఆశ్చర్యపోతున్నారు.

ఈ గొడవ అంతా నరసింహం పంతులవారి మీదిగా పోతూంది. పాపము ఆయన రోజూ ఆస్పత్రికి వెళ్లి నిత్యానందాన్ని చూడడమే కాకుండా రోగ నివారణకు అయ్యే ఖర్చులన్నీ కూడా యిచ్చుకోడం మొదలు పెట్టినాడు. షుమారు యెంద రూపాయలు పంతులుకు పదిలంగా వదిలినయి.

రోజులు గడుస్తూవున్నా నిత్యానందము రోగము మాత్రము యిత్థమిదమని తేలలేదు.

ఈలోపల స్కూలు ఫయినలు పరీక్షలు మాత్రము దాటిపోయినవి.

---